31వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
మంగళవారం 14 ఏప్రిల్ 2026




## జగిత్యాల కాంగ్రెస్‌లో చల్లారని
# వర్గ విభేదాలు

- మంత్రి అడ్లూరి వర్సెస్ ఎమ్మెల్యే సంజయ్ వర్గం
- సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు మంత్రి అడ్లూరి వర్గం యత్నం
- చివరి క్షణంలో సీఎం అపాయింట్మెంట్ క్యాన్సిల్
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి రాజీనామా అనంతరం కొనసాగుతున్న అంతర్గత కలహాలు

చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 13 : జగిత్యాల కాంగ్రెస్ లో వర్గ విభేదాలు మరో బహిర్గతమయ్యాయి. జగిత్యాలలో మంత్రి అడ్లూరి వర్గం వర్సెస్ ఎమ్మెల్యే డా. సంజయ్ వర్గం మధ్య కోల్డ్ వార్ నడుస్తున్నట్లుగా తెలుస్తుంది. జగిత్యాల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎంపికలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ తన అనుచరులకే పదవులు దక్కేలా పావులు కదపడంతో, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈ విషయాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి అడ్లూరి జగిత్యాల సీనియర్ కాంగ్రెస్ నేతలను సీఎం రేవంత్ రెడ్డితో భేటి చేయించి వారి సమస్యను పరిష్కరించేందుకు సీఎం అపాయింట్మెంట్ తీసుకున్నారు. జగిత్యాలకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు సోమవారం సీఎం రేవంత్ రెడ్డితో భేటి కావడానికి హైద్రాబాద్ బయలుదేరే సమయానికి సీఎంతో భేటి రద్దు అయినట్లు తెలిసింది. సీఎంతో భేటి రద్దు కావడంతో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే డా. సంజయ్ తన అనుచరులకే -2లో



## మాజీ స్పీకర్ శ్రీపాద రావు
# సేవలు మరువలేనివి

- శ్రీపాదరావు స్పీకర్ పదవికి వన్నె తెచ్చారు
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**చురకలు విలేకరి, ధర్మపురి, ఏప్రిల్ 13** : శ్రీపాద రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. స్వర్గీయ శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా జగిత్యాల జిల్లా ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి మంత్రి లక్ష్మణ్ కుమార్ నివాళ్లులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మారుమూల మంథని ప్రాంతంలోని ధన్వాడ గ్రామంలో జన్మించిన శ్రీపాద రావు ధన్వాడ సర్పంచ్ గా, మంథని సమితి ప్రెసిడెంట్గా, మంథని ఎమ్మెల్యేగా సేవలు అందించారని మంత్రి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గా పనిచేసి స్పీకర్ పదవికి వన్నెతెచ్చిన గొప్ప నేత శ్రీపాద రావు అని అన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరితో కలివిడిగా ఉంటూ శ్రీపాద రావు అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు రాజకీయాల్లో రాణిస్తున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా ధర్మపురి ప్రజల పక్షాన వారికి నివాళులు అర్పిస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఇందరపు రామన్న కౌన్సిలర్లు, చిపిరిశెట్టి రాజేష్,అయ్యోరి వేణు, సర్పంచ్ లు చిలుముల లక్ష్మణ్, పందిరి అశోక్, జక్కు రవీందర్, సుముఖ్, రఫీ,అప్పం తిరుపతి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# భద్రంగా.. సామాజిక బాధ్యతగా రోడ్డుపై వెళ్లాలి

- వాహనదారులు, ప్రజల భద్రతకు అరైవ్.. అలైవ్ కార్యక్రమాలు అమలు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు
- భద్రత ప్రతిజ్ఞ, బ్లాక్ స్పాట్స్, ప్రమాదకర రహదారుల గుర్తింపు







**చురకలు ప్రతినిధి సిరిసిల్ల ఏప్రిల్ 13** : రోడ్డుపై వెళ్లే ప్రతి వాహనదారుడు భద్రంగా.. సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వెళ్లాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పోలీస్ శాఖ, రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ నుంచి వారోత్సవాల సందర్భంగా మొదటి రోజు పోలీసుల ఆధ్వర్యంలో కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో -2లో

## అన్ని వర్గాల ప్రజల కృషితోనే
# రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం

- జగిత్యాల కలెక్టర్ బి. సత్య ప్రసాద్
- ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం
- రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం
- ఎస్పీ అశోక్‌కుమార్






**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 13** : అన్ని వర్గాల ప్రజల కృషితోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, 2లో

## ఇంటర్ ఫలితాల్లో
## బ్లూమింగ్ వోకేషనల్ కళాశాల ప్రభంజనం

**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 13:**నిన్న విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో నగరంలోని రేకుర్తి సూర్య నగర్ లో గల బ్లూమింగ్ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరీంనగర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రభంజనం సృష్టించారు. పి. హారిక ఎంపిహెచ్ డబ్ల్యు రెండవ సంవత్సరం 949/1000, జె. అక్షయ ఎం పి హెచ్ డబ్ల్యు రెండవ సంవత్సరం సంవత్సరం 921/1000, పి. అంజలి ఐ అండ్ ఎం మొదటి సంవత్సరం 472/500, జి కృష్ణవేణి ఎం పి హెచ్ డబ్ల్యు మొదటి సంవత్సరం 442/500, ఎండి అఫ్రోజ్ ఎం పి హెచ్ డబ్ల్యు మొదటి సంవత్సరం 436/500,ఎమ్మెల్టీ రెండవ సంవత్సరం సతీష్ 846/1000లు అద్భుతమైన ఫలితాలను సాధించి విజయ దుందుభి మోగించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎంఎ ఖుద్దూస్ మాట్లాడుతూ బ్లూమింగ్ ఒకేషనల్ కళాశాల విద్యార్థులు సాధించిన విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమ కళాశాల సిబ్బంది కృషి, మార్గదర్శకత్వం వల్ల ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని విజేతలైన విద్యార్థులను, అధ్యాపక టీమును, సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులో ఈ వృత్తి విద్య కోర్సుల ద్వారా, రాష్ట్ర ప్రభుత్వ కేంద్ర ప్రభుత్వ అటు విదేశాలలో మంచి డిమాండ్ తో కూడిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి నిర్మల, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల కాంగ్రెస్‌లో...

**మొదటి పేజీ తరువాయి....** కోఆప్షన్ పదవులు కట్టబెడుతున్నారని ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి జీవనరెడ్డి రాజీనామా అనంతరం కూడా జగిత్యాల కాంగ్రెస్ లో కలహాలు చోటుచేసుకుంటుండటంతో టిపిసిసి నేతలు తలలు పట్టుకుంటున్నారు. బిఆర్ఎస్ నుండి వచ్చిన వారికే అన్ని అంశాల్లో పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వారికి మొండి చేయి చూపిస్తున్నారని పలువురు విమర్శలు చేస్తున్నారు. జగిత్యాల మున్సిపల్ కోఆప్షన్ సభ్యులుగా నలుగురిని ఎన్నుకునే అవకాశం ఉండగా అందులో కొందరు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మంత్రి అడ్లూరిని కలిసి తమకు కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరారు. అయితే ఇటీవలే ఎమ్మెల్యే డా.సంజయ్ పట్టణ కౌన్సిలర్లతో భేటి అయి తాను సూచించిన వారికే ఓటు వేయాలని చెప్పినట్లు తెలిసింది. కోఆప్షన్ సభ్యులు ఎన్నిక పంచాయితీ కాంగ్రెస్ పార్టీలో మరోసారి కలహాలను బహిర్గతం చేయగా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలి. చివరి నిమిషంలో సీఎంతో భేటికి బయలుదేరే సమయంలో బస్సు రాకపోవడంతో పర్యటన రద్దు అయిందని నాయకులు చెప్పుకోవడం కొసమెరుపు.

త్వరలోనే సీఎంతో నాయకుల భేటి...

జగిత్యాల పట్టణానికి చెందిన కౌన్సిలర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సోమవారం సీఎం రేవంత్ రెడ్డితో భేటి కావాల్సి ఉండగా అనివార్య కారణాలతో భేటి వాయిదా వేశారని, త్వరలోనే సీఎం రేవంత్రెడ్డితో కౌన్సిలర్లు, నాయకుల భేటి ఉంటుందని జగిత్యాల డిసిసి అధ్యక్షుడు గాజెంగి నందయ్య తెలిపారు. జగిత్యాల కాంగ్రెస్ లో ఏలాంటి అంతర్గత విభేదాలు లేవని, అందరు ఏకనాయకత్వాన్నే కోరుకుంటున్నారని, సీఎం రేవంత్రెడ్డితో భేటి విషయంలో సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు.

## అన్ని వర్గాల ప్రజల కృషితోనే...

**మొదటి పేజీ తరువాయి...**ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా "అరైవ్ అలైవ్ " కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ బస్ స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ చేపడుతున్న "అరైవ్ అలైవ్ " కార్యక్రమం ప్రశంసనీయమని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా, నియమ నిబంధనలు పాటిస్తూ ప్రయాణిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. రోడ్డు భద్రత ఒక్క పోలీస్ శాఖ బాధ్యత కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. "వేగం ప్రాణం తీస్తుంది" అనే విషయాన్ని గుర్తుంచుకుని అధిక వేగంతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# హుజురాబాద్ బీజేపీలో చల్లారని "నిధుల" సెగలు

### అసంతృప్తితో రగిలిపోతున్న కార్యకర్తలు!



**(కోరెం సుధాకర్ రెడ్డి, చురకలు ప్రతినిధి, హుజురాబాద్) :**
మున్సిపల్ ఎన్నికలు ముగిసి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ.. బీజేపీలో నిధుల లొల్లి ఇంకా వీడడం లేదు. నియోజకవర్గంలోని హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలను కైవసం చేసుకునేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు చేసారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకారంతో... భారీగా ఎన్నికల నిధులను కూడా అధిష్ఠానం సమకూర్చినట్లు ప్రచారం జరిగింది. అయితే ఎన్నికల ఫండ్ ఖర్చు చేయకుండా కొందరు మింగేశారని, అనుకున్న విధంగా ప్రచారం చేయలేదనే ప్రచారం అంతర్గతంగా చర్చ జరుగుతోంది. నిజానికి హుజురాబాద్ లో బీజేపీ బలంగా ఉంది. గతంలోనూ ఇక్కడ బీజేపీ కొన్ని సీట్లు గెలిచింది. ఈసారి ఎలాగైనా రెండు మున్సిపాలిటీలను కైవసం చేసుకోవాలని ఆ పార్టీ భావించింది. హుజురాబాద్, జమ్మికుంటలలో బీజేపీ గెలవాలని, లేకుంటే.. కనీసం హంగ్ ఏర్పాటు కావాలని భావించారు. కానీ బీజేపీ అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయింది. ఇక్కడ బీజేపీలో బండి సంజయ్, ఈటల రాజేందర్ వర్గాలు రెండు ఉన్నప్పటికీ.. ఈటల వర్గాన్ని కావాలని దూరం పెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఈటల రాజేందర్.. తాను మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు హుజురాబాద్ కు వెళ్తానంటే.. అధిష్ఠానం వద్దని ఆదేశాలిచ్చినట్లు స్పష్టంగా చెప్పారు. ఐతే బండి సంజయ్ వర్గానికి పనిచేస్తున్న నేతలు కొందరు నిబద్ధతతో పనిచేయకుండా.. కేవలం పనిచేసినట్లు నటిస్తున్నారని, వారే నిధులు వార్డుల వరకు రాకుండా.. ఓటర్లకు ఇవ్వకుండా.. ప్రచారానికి సైతం సరైన విధంగా ఖర్చు చేయకుండా మోసం చేసారని, అందుకే ఎన్నికల్లో జోష్ రాలేదని, కనీసం కష్టపడిన కార్యకర్తల బాగోగులు కూడా చూడలేదని క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకువెళ్లి తమ ఆవేదనను వ్యక్తం చేసినట్లు సమాచారం. హుజురాబాద్ నియోజకవర్గంలో డామినేషన్ చేస్తున్న ఒకరిద్దరు నేతలు పార్టీని బలోపేతం చేసేందుకు పని చేయకుండా..సుదీర్ఘ కాలంగా పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్నవారిని పట్టించుకోకుండా.. ఈటల వర్గాన్ని అణగదొక్కినట్లు నటిస్తూ.. వ్యక్తిగత లబ్ధికోసం, ప్రతిష్ఠకోసం, తమ మాట నెగ్గించుకునేందుకు పనిచేస్తున్నారని, కేంద్ర మంత్రి పేరుతో పైరవీలు చేస్తున్నారని, పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాగా మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ ఫండ్ దుర్వినియోగంపై కేంద్ర మంత్రి తన వేగుల ద్వారా ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభించినట్లు తెలిసింది. ఇప్పటికైనా స్వార్థం కోసం పనిచేస్తున్నవారిని పక్కనబెట్టి.. నిస్వార్థంగా పనిచేస్తున్న వారిని అధిష్టానం గుర్తించి బాధ్యతలు అప్పగించాలని, లేకుంటే.. పార్టీ మనుగడ కష్టమవుతుందని క్షేత్ర స్థాయి కార్యకర్తలు చెబుతున్నట్లు తెలుస్తోంది.

# భద్రంగా.. సామాజిక బాధ్యతగా రోడ్డుపై వెళ్లాలి

**మొదటి పేజీ తరువాయి...** సోమవారం అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బిగితే హాజరయ్యారు. ముందుగా అరైవ్.. అలైవ్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి వీడియో సందేశం వినిపించారు. రోడ్డు ప్రమాదాలతో ఓ కుటుంబం పడుతున్న ఇబ్బందుల ఆధారంగా రూపొందించిన సందేశం వీడియో ఆలోచింపజేసింది. గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసి.. గ్రామస్తులతో అరైవ్.. అలైవ్ పై ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలి లో భాగంగా పోలీస్ శాఖ ఆద్వర్యంలో అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి సందేశం ప్రకారం యుద్ధాలు, వ్యాధుల ఇతర కారణాలతో ఎక్కువ మరణాలు జరగడం లేదని, రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది మృతి చెందుతున్నారని వెల్లడించారు. ప్రతి వాహనదారుడు సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లలో తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, మేజర్లకే జాగ్రత్తలు చెపుతూ వాహనాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, భవిష్యత్ ప్రణాళికలు రచించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో పారిశుధ్య పనులు, రెసిడెన్షియల్ విద్యార్థులు, ప్రజలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేయించామని, అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించామని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు వీధిన పడుతున్నాయని, ప్రతి వాహనదారుడు ఇంటి నుంచి వెళ్లింది మొదలు ఇంటికి వచ్చే వరకూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పిలుపు నిచ్చారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నారని వివరించారు. సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇటివల డీ అడిక్షన్, కౌన్సెలింగ్ కేంద్రం ప్రారంభించామని తెలిపారు. యువత, విద్యార్థులు ఆటలు ఆడాలని.. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే సీఎం కప్ పేరిట 40 విభాగాల్లో పోటీలు నిర్వహించామని గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు 300 కోట్ల జీరో టికెట్లపై ప్రయాణం చేసి.. రూ. 10వేల కోట్లు ఆదా చేశారని తెలిపారు. రైతును రాజుగా చేయడమే లక్ష్యంగా వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, రూ. 2 లక్షల లోపు రుణ మాఫీ చేశామని గుర్తు చేశారు. ఇండ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, వేములవాడ నియోజకవర్గంలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ లో భాగంగా వివిధ నీటి పారుదల ప్రాజెక్ట్ ల పనులు కొనసాగుతున్నాయని, మల్కపేట ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేశామని తెలిపారు. నూతన రేషన్ కార్డులు ఇస్తున్నామని, నూతన కుటుంబ సభ్యుల పేర్లు నమోదు అవుతున్నాయని వెల్లడించారు. రేషన్ కార్డ్ లు ఉన్న అందరికీ సన్న బియ్యం ఇస్తున్నామని, రాష్ట్రంలో 86 శాతం మందికి పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో మొదటి స్థానం..

రాష్ట్రంలో ఆంజనేయ స్వామి గుడి లేని ఊరు ఉండదని.. ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు ఉండదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక ప్రణాళిక.. ఆచరణ కార్యక్రమాలతో రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయిన జాబితాలో జిల్లా మొదటి స్థానంలో ఉందని కొనియాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. నిజామాబాద్ గ్రామంలో 44 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, లబ్ధిదారులకు రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం ఇస్తున్నామని వెల్లడించారు. త్వరలో ఇందిరా ఆత్మీయ భరోసా.. బీమా పథకం అమలు చేయనున్నామని పేర్కొన్నారు. వృద్ధుల సంక్షేమానికి చట్టం తీసుకువచ్చామని, త్వరలో కొత్త పెన్షన్లు ఇస్తామని చెప్పారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు.వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు.టీబీ ముక్త్ భారత్ లో భాగంగా జిల్లాకు వచ్చిన మొబైల్ ఎక్స్ రే యంత్రం ప్రారంభించామని, నిర్దేశిత గ్రామాల్లో పరీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో గత ఏడాది 4,80,000 ప్రమాదాలు జరిగాయని, దానిలో 1,70,000 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రతి డ్రైవర్ రోజు వాహన భద్రత ప్రతిజ్ఞ చేసి ఇంటి నుంచి బయటకు వెళ్ళాలని సూచించారు. తమ కుటుంబ, పిల్లల బాద్యతను గుర్తు పెట్టుకొని జాగ్రతగా వెళ్లాలని పేర్కొన్నారు.

# ఇంటర్‌లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

## -ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 100% ఉత్తీర్ణత



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఎప్రిల్ (13):** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు.సంస్థ విడుదల చేసిన వివరాల ప్రకారం,యంపిహెచ్ డబ్ల్యూ , సిఈసి విభాగాల్లో విద్యార్థినులు అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాలకు మరియు మండలానికి గర్వకారణంగా నిలిచారు.ఈ విద్యాసంవత్సరం ఫలితాల్లో యంపిహెచ్ డబ్ల్యూ (1వ మరియు 2వ సంవత్సరం) సి ఈ సి (2వ సంవత్సరం) విభాగాల్లో పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం ఎ.నవిత (యం పి హెచ్ డబ్ల్యూ 1వ సంవత్సరం :500/491) (98.2%) మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది.డి. రష్మిత (యం పి హెచ్ డబ్ల్యూ 2వ సంవత్సరం: 1000/981) (98.1%) మార్కులు సాధించి సత్తా చాటింది. సీఈసీ విభాగం మెరిట్ సాధించిన వారు :2 వ సంవత్సరం జి.వైభవి :1000/ 951 మార్కులు 1వ సంవత్సరం యం.మాధవి 500/ 465 (93%) మార్కులు సాధించి మెరిసింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేక అధికారి మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థినులను అభినందించారు.విద్యార్థినుల కఠోర శ్రమ, ఉపాధ్యాయుల బోధన వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, పలు గ్రామాల ప్రజలు అభినందించారు.

# ఫకీర్ కోండాపుర్‌లో బడిబాట



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఎప్రిల్ (13):** జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని పకీర్ కొండాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల అద్వర్యం లో సోమవారం బడిబాట కార్యక్రమం ను ప్రారంభం చేశారు. విద్యార్థి విద్యార్థులతో కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చెర్పించాలని పాఠశాల లో అందుతున్న సౌకర్యాలు వివరిస్తు ,కరపత్రాలు పంపిణీ చేస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం రేణుక ,గ్రామ సర్పంచ్ తోట రమేష్ ,పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్,కాంగ్రెస్ నాయకులు సింగని మారుతి ప్రసాద్ ,నవీన్ ,రేష్మా , గంగారం, దీప తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు

## -ఎస్పీ అశోక్ కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 13** :బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ న్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 22 మంది ఆర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

# ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షల నిర్వహణ

## జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 13 :** పదవ తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించామని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. పదవ తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా చివరి పరీక్ష నేపథ్యంలో సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పురాణిపేట లోని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచిం చారు. పరీక్షా గదుల్లో వెలుతురు, తాగునీ రు, శౌచాలయాల నిర్వహణ సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకో కుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.పరీక్షల సమయంలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. పరీక్షలు నిబద్ధతతో, భాద్యతగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సోమవారం నాటితో పదవ తరగతి పరీక్షలు పూర్తవుతున్నందున సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అందరు ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, డి.ఈ. వో. కె. రాము , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్ల మైనారిటీ గురుకులంలో ఐదవ తరగతి అడ్మిషన్లకు భారీ డిమాండ్




**చురకలు విలేకరి కోరుట్ల ఏప్రిల్ 13:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్థాపించిన కోరుట్ల మైనారిటీ గురుకుల పాఠశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి ఐదవ తరగతి అడ్మిషన్లకు భారీగా డిమాండ్ ఏర్పడింది ప్రస్తుతం పరిమిత సంఖ్యలో సీట్లు మాత్రమే మిగిలి ఉండటంతో మైనారిటీ విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్ల కోసం పోటీ పడుతున్నారు ఈ పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్య బోధన విధానం మరియు నిరంతరంగా 100% ఉత్తీర్ణత శాతం ఈ క్రేజ్‌కు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి ఇటీవల నియమితులైన పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ జె. రాములు అనుభవం అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందిస్తున్నారు. విద్యార్థులలో వినడం చదవడం రాయడం (గా=ఔ) వంటి ప్రాథమిక నైపుణ్యాలతో పాటు గణితంలో బేసిక్ సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దీని వలన విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోవడంతో పాటు ఇంగ్లీషులో మాట్లాడే నైపుణ్యాన్ని కూడా అభివృద్ధి చేసుకుంటున్నారు ఈ మార్పులపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.పాఠశాలలో ఉచిత నాణ్యమైన విద్యతో పాటు భోజనం హాస్టల్ వసతి యూనిఫార్ములు షూస్ వంటి సదుపాయాలను ప్రభుత్వం అందిస్తోంది అదనంగా విద్యార్థుల శారీరక మానసిక వికాసం కోసం నిష్ణాతులైన రాజు ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తున్నారు ఈ గురుకుల పాఠశాలలో అల్పసంఖ్యాక వర్గాల విద్యార్థులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తారు. ప్రస్తుతం 5, 6, 7, 8 తరగతుల్లో కూడా కొన్ని పరిమిత సీట్లు మాత్రమే మిగిలి ఉండటంతో తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో అడ్మిషన్ల కోసం క్యూ కడుతున్నారు

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

## జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 13:** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపుకలెక్టర్ ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 63 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం 8వ పోషణ్ పక్ వాడ పోస్టర్, ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ పథకం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, బి.రాజ గౌడ్, జగిత్యాల, కోరుట్ల, ఆర్డీవోలు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

### -ఇబ్రహింపట్నం ఎస్ఐ నవీన్ కుమార్




**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఎప్రిల్ (13):**
రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రమాదం జరగకుండా చుసుకోవలని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం ఎస్ ఐ నవిన్ కుమార్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా ఎస్పీ ఎ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మండలకేంద్రం లోని గ్రామపంచాయతీ కార్యలయం అవరణం లో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రజల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని,ఇటీవల జరిగిన పలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం డ్రైవర్ల నిర్లక్ష్యమేనని సుచించారు. ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం,సెల్‌ఫోన్ ఉపయోగించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయన్నారు. వాహనదారులు తమ భద్రత కోసం, తమ కుటుంబాల కోసమే ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు యువత అందరితో రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని, మిగతా వారితో పాటించేలా చేస్తామని ప్రమాద రహిత ప్రాంతంగా ఏర్పాటుకు తమ వంతు కృషి తప్పక చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్,ఉపసర్పంచ్ నాంపల్లి రమేష్, నాయకులు చింతకుంట శంకర్,బ్లూ క్లోట్స్ పోలీసులు ,స్థానిక ప్రజా ప్రతినిధులు ,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎండపల్లి మండలం అంబారిపేటలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం



**చురకలు విలేకరి ఎండపల్లి ఏప్రిల్ 13:** ఎండపల్లి మండలం అంబారిపేట గ్రామంలో 'ూతీతీఱఙవ ూశ్రీఱఙవ' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఖూూ ఆదేశాల మేరకు, జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ సూచనలతో, ధర్మపురి సీఐ ఎ. రామ్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఈ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వెల్గాటూర్ ఎస్సై పి. ఉదయ్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రజలకు పలు ముఖ్య సూచనలు చేశారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, అతివేగం నివారించాలని హెచ్చరించారు. ముఖ్యంగా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు కలిసి రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్డు సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేశారు. సర్పంచ్‌తో పాటు వివిధ శాఖల ఉద్యోగులు, మహిళలను కమిటీ సభ్యులుగా చేర్చారు. కార్యక్రమం అనంతరం అంబారిపేట గ్రామ శివారులో రోడ్డుపక్కన ఉన్న చెట్ల పొదలను గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దర్శనాల నరేష్, అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, ఆశా వర్కర్లు, కారోబార్, పోలీస్ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

### ధర్మపురి సిఐ రాంనర్సింహా రెడ్డి



**చురకలు విలేకరి, ధర్మపురి, ఏప్రిల్ 21 :** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాంనర్సింహా రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దొనూర్ గ్రామంలో ప్రజా పాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు రోడ్డు భద్రతపై ప్రజలకు విలువైన సందేశాలు అందించారు. ధర్మపురి సిఐ ఎ.రాం నరసింహారెడ్డి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, అతివేగం నివారించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు. గ్రామస్తులు అందరూ కలిసి రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా ఒక రోడ్డు సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో సర్పంచితో పాటు వివిధ విభాగాల ఉద్యోగులు, మహిళలు కూడా సభ్యులుగా ఉండేలా ఏర్పాటు చేశారు. తక్షణ చర్యగా గుంతలతో ఉన్న రహదారిపై రెండు ట్రాక్టర్ల మట్టిని పోసి రోడ్డును సరి చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పురుషోత్తం మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా రోడ్డు భద్రత కార్యక్రమం అరైవ్ అలైవ్ కోసం మా దోనూర్ గ్రామాన్ని ఎంపిక చేసినందుకు ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. రామ నర్సింహారెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి నుంచి తమ గ్రామంలో ఒక తీర్మానం తీసుకున్నాము. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని నిర్ణయించాము. ఈ నిర్ణయాన్ని ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పత్తి రవీందర్, పశు వైద్యాధికారి దుంపల వేణు గోపాల్, మార్కెట్ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 13 :** జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ సోమవారం హైద్రాబాద్లో రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఉన్న పంచాయితీరాజ్ రహదారులను బిటి రోడ్డులుగా మార్చాలని, ముఖ్యమైన రోడ్డులను హామ్ రోడ్డుల్లో చేర్చాలని కోరుతూ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందించగా, మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ తెలిపారు.

## ఎన్సీసీ క్యాంపులో సత్తా చాటిన గౌతమ్ విద్యార్థిని



**చురకలు విలేకరి, కోరుట్ల, ఏప్రిల్ 13 :** కోరుట్ల పట్టణంలోని గౌతమ్ ఉన్నత పాఠశాలకు చెందిన జాతీయ క్యాడెట్ కార్ప్స్ (ఎన్సీసీ) 9వ బెటాలియన్ విద్యార్థులు కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్లో నిర్వహించిన ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ చాంపియన్షిప్లో ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 100 మంది క్యాడెట్లలో ఫైరింగ్ విభాగంలో జుహమ హీన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకుంది. కోరుట్ల పట్టణంలో హాజీపూర్కు చెందిన షేక్ సద్దాం కుమార్తె, ఉజ్మా తబస్సుమ్ కుతూరు జుహమహీన ను పాఠశాల వ్యవస్థాపకులు ఎం.ఎ. గఫార్ అభినందించారు. ఈ సందర్భంగా ఎన్సీసీ అడ్మిన్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత మాట్లాడుతూ యువతలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం పెంపొందించడమే ఎన్సీసీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. క్యాడెట్లు అన్ని రంగాల్లో × రాణించేందుకు శిక్షణ కార్యక్రమాలను ఆస్వాదిస్తూ స్నేహస్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. శిబిరంలో క్యాడెట్లు ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, యుద్ధ నైపుణ్యాల్లో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు.

## రాజారాంపల్లిలో భారాస సన్నాహక సమావేశం



**చురకలు విలేకరి ఎండపల్లి ఏప్రిల్ 13:** ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు భారత రాష్ట్ర సమితి (భారాస) మండల కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. జగిత్యాలలో ఏప్రిల్ 20న సాయంత్రం 5 గంటలకు జరగనున్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదే సందర్భంగా మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ చేరికకు స్వాగతం పలికారు. మండల అధ్యక్షుడు సింహాచలం జగన్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 13 :** జగిత్యాల జిల్లా మల్యాల ఎక్స్ రోడ్ లో గల అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో యూకేజీ (యూకెజి) పూర్తి చేసిన విద్యార్థుల కోసం గ్రాడ్యుయేషన్ సెర్మనీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే పునాది అని, చిన్ననాటి నుంచే వారిలో విషయాలపై సమగ్ర అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. విశ్లేషణాత్మక బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చని సూచించారు. పై తరగతులకు వెళ్లే క్రమంలో నిర్వహించే ఈ గ్రాడ్యుయేషన్ వేడుక విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపింది...

# ట్రాఫిక్ నియమాలతో రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం

## మెట్ పల్లి సీఐ అనిల్



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్,ఏప్రిల్ 13:** ప్రజలు ట్రాఫిక్ నియమాలను పాటించాలనీ అందరి కృషితోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని సిఐ అనిల్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం,ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహనా కల్పించడం కోసం మండలంలోని వెల్లుల గ్రామాల్లో సోమవారం "అరైవ్ అలైవ్ " కార్యక్రమాన్ని జరిపారు.ఈ మేరకు సిఐ అనిల్,ఎస్ఐ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ శాఖ చేపడుతున్న "అరైవ్ అలైవ్ " కార్యక్రమం ప్రశంసనీయమని వాహనదారులు జాగ్రత్తగా, నియమ నిబంధనలు పాటిస్తూ ప్రయాణిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. రోడ్డు భద్రత ఒక్క పోలీస్ శాఖ బాధ్యత కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. "వేగం ప్రాణం తీస్తుంది" అనే విషయాన్ని గుర్తుంచుకుని అధిక వేగంతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గూడూరు తిరుపతి,ఎస్ఐ కిరణ్ కుమార్,ఎస్ఐ గంగాధర్, కార్యదర్శి నారాయణ, మెడికల్ ఆపిసర్ ఆంజిత్ రెడ్డి,ఆర్ఐ కాంత్తయ్య, ఉప సర్పంచ్ రాజా శేఖర్,వార్డు మెంబర్స్ మరియు అంగన్వాడీ టీచర్స్,గ్రామ ప్రజలు పాలుగోన్నారు.

## కమ్మునూర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం



**చురకలు విలేకరి, బీర్ పూర్, ఏప్రిల్ 13 :** బీర్పూర్ మండలంలోని కమ్మునూర్ గ్రామంలో జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ సహాకారంతో మంజూరైన సిసి రోడ్డు పనులను సోమవారం గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రూ.5లక్షల నిధులతో సిసి రోడ్డు పనులను చేపడుతున్నామని, సిసి రోడ్డు మంజూరు చేసిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తరాల మల్లేశం, పంచాయితీ కార్యదర్శి, వార్డు సభ్యులు బందెల వెంకటేష్, కిషోర్, లక్ష్మి రాజేశం, సుజాత నారాయణ, ప్రవళిక గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిని నిరాదరిస్తున్న ఉపాధ్యాయుడిపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**చురకలు విలేకరి, జగిత్యాల, ఏప్రిల్ 13:** జగిత్యాల పట్టణానికి చెందిన మాదారపు కనుకమ్మ (73)అనే పక్షవాతంతో భాద పడుతున్న వృద్ధురాలు జిల్లా సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయంతో సోమవారం ప్రజావాణి లో కలెక్టర్ కు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు లో వివరాలు విలేకరులకు రోదిస్తూ తెలిపింది.ఇంటి నుంచి గెంటి వేయగా హనుమాన్ వాడ ఓ రేకుల షెడ్డులో తన పెళ్లి కాని కూతురుతో దుర్భర స్థితి లో జీవిస్తున్నానని,మేడి పల్లి మండలం దమ్మన్న పేట ప్రభుత్వ స్కూల్ లో హెడ్ మాస్టారు గా పనిచేస్తున్న నా కొడుకు మాదారపు గంగాదర్ వేతనం నుంచి 15శాతం డబ్బులు ప్రతి నెల తన బ్యాంకు ఖాతా లో జమచేయించాలని, తన వద్ద నుండి తీసుకున్న రూ. 10లక్షలు, 15తులాల బంగారం ఇప్పించాలని, నివా స వసతి కల్పించాలని కలెక్టర్ ను కోరింది. వృద్ధురాలి వెంట ఆమె కూతురు శాంత,సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్ కుమార్, జిల్లా ప్రతినిధులు పి. సి. హన్మంత్ రెడ్డి, గౌరి శెట్టి విశ్వ నాతం, బొల్లం విజయ్ బొబ్బటి కరుణ,ఎం. డి. యాకూబ్ పట్టణ అధ్యక్షులు మానాల కిషన్ తదితరులున్నారు.

## బుగ్గారంలో లైబ్రరీ ఏర్పాటు చేస్తాం



**చురకలు విలేకరి, జగిత్యాల, ఏప్రిల్ 13:** పాత నియోజక వర్గ కేంద్రమైన బుగ్గారం మండల కేంద్రంలో గ్రంథాలయ భవనం నిర్మించి లైబ్రరీ ఏర్పాటు చేద్దామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన జగిత్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘనబట్ల దినేష్ శర్మ అన్నారు. తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షులు, బుగ్గారం విడిసి వ్యవస్థాపక అధ్యక్షులు చుక్క గంగారెడ్డి దినేష్ శర్మ ను ధర్మపురిలో కలిశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా దినేష్ శర్మ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శాలువాతో సత్కరించి శుభా కాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుకుంటూ బుగ్గారం మండల కేంద్రంలో స్థలం చూసి, లైబ్రరీ భవనం నిర్మించాలని చుక్క గంగారెడ్డి కోరగా దినేష్ శర్మ సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు. యువతకు, విద్యార్థినీ – విద్యార్థుల కోసం త్వరలోనే లైబ్రరీ ఏర్పాటు చేయాలని వారు నిర్ణయించుకున్నారు.

## నూతన ఉపాధిహామీ పనుల ప్రారంభం



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, ఏప్రిల్ 13:** మేట్ పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామాల్లో ఉపాధిహామీ పథకములో భాగంగా నాగులమ్మ గుట్టకు కంధకాలు కోసం పదిలక్షల మంజూరు కాగా సోమవారం మంజూరు అయినా నూతన పనులకు సర్పంచ్ పుల్ల సాయగౌడ్ (జగన్ ) కూలీలతో కలిసి పనులను ప్రారంభించారు. ప్రస్తుతం విపరీతమైన ఏండల వల్ల వడదెబ్బ తగలకుండా ఉపాధిహామి కూలీలు జాగ్రత్త చర్యలు పాటించలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ కుమార్,వార్డ్ నెంబర్ నిమ్మల సాయమ్మ,ఫీల్డ్ అసిస్టెంట్ కోరం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, ఏప్రిల్ 13:** స్థానిక ఆహార పదార్థాలు చిరుధాన్యాలతో చేసే ఆరోగ్యకరమైన వంటకాలు పిల్లలకు ఎంతో మేలు అంటూసూపర్వైజర్ హేమలత అన్నారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో సోమవారం అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా తల్లులకు ముఖ్య కార్యక్రమంగా స్థానిక ఆహార పదార్థాలు మరియు చిరుధాన్యాలతో ఆరోగ్యకరమైన వంటకాల ప్రదర్శన జరిపి చిరుధాన్యాల వంటకాల తయారీ విధానాన్ని ప్రతి వంటకం పోషక విలువలు,సమతుల ఆహారం ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం గ్రామస్తులు అందరూ అంగన్వాడి యొక్క సేవలను సద్వినియోగం చేసుకోవాలని, అంగన్వాడీ పిల్లల హాజరు శాతం పెంచాలని సర్పంచ్ సుమలత జీవన్ రెడ్డి అన్నారు.ఈ సమావేశంలో ఉపసర్పంచ్ పిల్లి చిన్న మల్లేష్, కార్యదర్శి ఆసిఫ్,టీచర్ భూదేవి,వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన ఉండాలి




**చురకలు విలేకరి, మల్లాపూర్, ఏప్రిల్ 13:** రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్గి ఉండాలని ఆరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రచారాన్ని చేపట్టినట్లు ఎస్ఐ అనిల్ సోమవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎస్ఐ మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని, హెల్మెట్ ధరించాలని పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, రెవెన్యూ ఆర్ఐ రాజేష్, ఉప సర్పంచ్ సోమరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సంగ రాజం, కోటగిరి ఆనంద్ సిరిపురం రవీందర్, అంగన్వాడీ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వేంపేట పోషన్ పక్వాడ సమావేశం



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, ఏప్రిల్13:** మెట్ పల్లి మండల వెంపేట్ గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం అంగన్వాడీ పిల్లల తల్లులతో పోషన్ పక్వాడ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు అంగన్వాడీ సూపర్వైజర్ షమీ సుల్తానా మాట్లాడుతూ స్థానికంగా రోజువారీగా దొరికే వివిధ ఆకుకూరలు,కూరగాయలు, పండ్లు ఎక్కువ మోతాదులో తీసుకోవాలని బాలామృతం చే పలురకాల ఉపయోగాలును వివరించరు. అనంతరం బాలమృతంతో కొన్ని రకాల వంటలు చేసి ప్రదర్శన జరిపి ప్రీస్కూల్ హాజరు శాతం పెంచాలని గ్రామస్తులను కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ అల్లూరి సురేందర్ రెడ్డి మరియు గ్రామ వార్డు మెంబర్లు,ఆశా కార్యకర్తలు అంగన్వాడీ టీచర్లు జయలక్ష్మి,అరుణ, గంగాజల,రాజేశ్వరి పాల్గొన్నారు.

## వార్డ్ సభ్యుల శిక్షణా తరగతులపై ఆర్టీఐ దరఖాస్తు

**-21 అంశాలకు సమాచారం ఇవ్వాలని కోరిన చుక్క గంగారెడ్డి**

**-ఇరకాటంలో పంచాయతీ రాజ్ శాఖ, పోలీస్ శాఖ, వ్యవసాయ శాఖ**



**చురకలు విలేకరి, జగిత్యాల, ఏప్రిల్ 13:** అత్యంత వివాదాస్పదంగా మారిన జగిత్యాల జిల్లా బుగ్గారం మండల వార్డ్ సభ్యుల శిక్షణా తరగతులపై సమాచారం ఇవ్వాలని సోమవారం బుగ్గారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని ప్రజా సమాచార అధికారికి ప్రముఖ సీనియర్ ఆర్టీఐ కార్యకర్త, సామాజిక కార్యకర్త చుక్క గంగారెడ్డి దరఖాస్తు చేశారు. ఆ దరఖాస్తులో 21 అంశాలకు సంబంధించిన సమాచారం కావాలని ఆయన కోరారు. ఇందులో పంచాయతీ రాజ్ శాఖ, పోలీస్ శాఖ, వ్యవసాయ శాఖలకు సంబంధించిన సమాచారం కూడా ఉండడం శోషనీయం. ఆ మూడు శాఖలు ఈ ఆర్టీఐ దరఖాస్తుతో ఇరకాటంలో పడ్డట్లేనా...? అని ప్రజలు ముచ్చటిస్తున్నారు.ఇక అట్టి దరఖాస్తులోని 21 అంశాలకు సంబంధించిన పూర్తి సమాచారం గడువులోపు సంబంధిత అధికారులు జారీ చేస్తారో.... లేక కాలక్షేపం చేసి మా దగ్గర సమాచారమే లేదని చేతులు ఎత్తేస్తారో.... కాస్త వేచి చూడాల్సిందే..

## క్షేమంగా మీ గమ్యస్థానానికి చేరండి.

**-రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్.**



**చురకలు విలేకరి, రాయికల్, ఏప్రిల్ 13:** ప్రజలు ప్రయాణాల సమయంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి క్షేమంగా గమ్యస్థానానికి చేరాలని మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్ అన్నారు. సోమవారం రాయికల్ పట్టణంలోని అంగడి బజార్, మున్సిపల్ కార్యాలయంలో యువత,ఆటో డ్రైవర్, ప్రజాప్రతినిధులకు "అరైవ్ ఎ లైవ్" రోడ్డు ప్రయాణ భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వాహనాల చోదకులకు రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు వినియో గించాలని సూచించారు.పరిమితికి మించి ఓవర్ లోడు ప్రయాణం చేయకూడదని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల దీనస్థితిని వివరిస్తూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉందని పోలీసులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు,ఎస్సై సుదీర్ రావు,కౌన్సిలర్లు రాకేష్, పుర్రె శ్రీధర్, స్రవంతి,మౌనిక,మానస, నాయకులు తురగ శ్రీధర్ రెడ్డి,మచ్చ శేఖర్,బత్తిని నాగరాజు,భూమేష్,ఏఎస్ఐ దేవేందర్ నాయక్,పోలీస్ సిబ్బంది,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఆర్టిజన్ అన్మాడ్‌ల సమ్మె

జగిత్యాల జిల్లా మెట్ పల్లి డివిజన్ కార్యలయం ముందు సోమవారం ఆరవ రోజు సమ్మె కొనసాగుతుంది. మా సమస్యలకై టివి ఎఇ జెఏసి తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ఉద్యమంలోకి వెళ్లడం జరిగింది. ఉద్యమంలో భాగంగా మార్చి 26, 30వ తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి డివిజన్ ఆఫీసుల ముందు ధర్నా చేయడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా కార్యాలయం ముందు వంట వార్పు ప్రోగ్రాం ఏప్రిల్ 2 తారీఖున చేయడం జరిగింది. మరియు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిస్కంలో ఉన్న మా ఆర్టిజన్, అన్మన్ తో సహా వరంగల్ మహా ధర్నా ఏప్రిల్ 7 తారీఖున చేయడం జరిగింది. అప్పటికి మమ్ములను గుర్తించక చర్చలకు పిలవలేదు. దానితో మా సమస్యలు సమ్మెలో కైనా వెళ్లి సాధించుకోవాలని ఉద్దేశంతో, ఏప్రిల్ 8 నుండి నీ రవధిక సమ్మెలోకి వెళ్లడం జరిగింది. మా శ్రమను ఈ సంస్థకు ధారపోస్తున్నాము,తెలంగాణ ఉద్యమానికై, హైదరాబాద్ మింట్ కాంపౌండ్ లో స్మృతి దీక్ష తెల్ల బట్టలు వేసుకొని చేయడం జరిగింది.

# ఇంటర్ ఫైనల్ ఫలితాల్లో ఎల్లారెడ్డిపేట గ్రామ విద్యార్థుల ప్రభంజనం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 13 :** ఆదివారం వెలువడిన ఇంటర్ ఫైనల్ ఫలితాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతులు నేవూరి బామ్మ గారి రాజిరెడ్డి లతల కూతురు లక్షణ కరీంనగర్ లోని అల్ఫోర్స్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివి 985 /1000 అత్యుత్తమ ప్రతిభ కనబ రిచి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలువగా ఎల్లారెడ్డిపేట మండల తెలుగు ప్రభ దినపత్రిక రిపోర్టర్ మాజీ ఎంపిటిసి ఒగ్గు బాలరాజు యాదవ్ ఉపసర్పంచ్ రజిత ల కూతురు ఒగ్గు శ్రీనిధి యాదవ్ కరీంనగర్ లోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి విభాగంలో 984/1000 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచింది , ఎల్లారెడ్డిపేట మండల దిశ తెలుగు దినపత్రిక విలేఖరి పెంటం శ్రీనివాస్ రజిత కుమారుడు పెంటం నిహార్ హైద రాబాదులోని కేశవ స్మారక మెమోరియల్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకొని 927/ 1000 మార్కులు సాదించాడు. అదేవి ధంగా హెచ్ 5 ఛానల్ న్యూస్ రిపోర్టర్ యమగోండ పద్మా రెడ్డి చంధన కూతు రు యమగోండ సంజన ఎస్సార్ కళాశా ల మల్లంపేట ఎంపీసీ ద్వితీయ సంవత్స రంలో 898/1000 మార్కులు సాధించి ంది. ప్రతిభ కనబరిచిన పిల్లలను వారి తల్లిదండ్రులను అభినందించారు.

## వెల్గటూర్ లో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావుకు ఘన నివాళి.



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఏప్రిల్ 13.** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్, దివంగత కాంగ్రెస్ నేత దుద్దిళ్ల శ్రీపాదరావు 27వ వర్ధంతిని పురస్కరించు కొని జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేం ద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సోమవారం ఘన నివాళులు అర్పించారు పార్టీ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలందర్ రెడ్డి తోపాటు నాయకులు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఉమ్మడి రాష్ట్రంలో ఆయన చేసిన సేవలను స్మరించుకొని కొనియాడా రు.ఏఎంసి ఇంచార్జి చైర్మన్ గోళ్ళ తిరుపతి, మాజీ వెల్గటూర్ సింగిల్ విండో, కేడీసీసీ డైరెక్టర్ పొనుగోటి రామ్మోహన్ రావు, మాజీ సర్పంచ్ మేరుగు మురళి గౌడ్,మాజీ ఎంపీటీసీ అనుమాల మంజుల, రాజక్కపల్లె సర్పంచ్ దోరిశెట్టి మల్లేశం,మొక్కట్రావుపేట సర్పంచ్ కూసలక్ష్మన్,మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు గంద్ర ప్రతాప్ రావు,సందీప్ రెడ్డి ఏఎంసి డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ఏఎంసి ఇంచార్జి చైర్మన్‌గా బాధ్యతల స్వీకారం



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఏప్రిల్ 13.:** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోళ్ల తిరుపతి సోమవారం ఇంచార్జి చైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు కొనసాగిన ఛైర్పర్సన్ గోపికా జితేందర్ రెడ్డి రాజీనామ చేయడంతో మార్కెటింగ్ శాఖ వైస్ చైర్మన్ కు ఇంచార్జి చైర్మన్ గా బాధ్యతలు కట్టబెడుతూ ఉత్తర్వు లు జారిచేసింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి, మాజీ కేడీసీసీ డైరెక్టర్, పిఏసిఎస్ చైర్మన్ పొనుగోటి రామ్మోహన్ రావు,మాజీ సర్పంచ్ మేరుగు మురళి గౌడ్,మహిళా నాయకురాలు మంజుల,స్థానిక ప్రజాప్రతినిధు లు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్రో యువికా ప్రోగ్రాంకు ఎంపికైన వెల్గటూర్ టీఎంఎస్ విద్యార్థిని



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఏప్రిల్ 13.** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని చిలివేరి శ్రీనిత్య 2026 ఇస్రో పరిశోదన సంస్థ నిర్వహించిన క్విజ్ పోటీ లో ప్రతిభ కనబరచడం ద్వారా యనికా ప్రోగ్రాం నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ హైదరాబాద్ కు సెలెక్ట్ అయినట్లు ఇస్రో నుండి సమాచారం అందడం తో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్అధ్యాపకులు సిబ్బంది, తల్లిదండ్రులు, ప్రజాప్రతిని ధులు విద్యార్థిని అభినందించారు. తను పడ్డ కష్టానికి ప్రతిఫలం దక్కిందని, తనకు సైన్స్ విషయాలపై నున్న మక్కువను గ్రహించిన అధ్యాపక బృందం ప్రోత్సహించడం తోనే ఈఅవకాశం వచ్చినట్లు శ్రీ నిత్య పేర్కొంది. దేశ స్థాయిలో 456 మంది విద్యార్థులను ఎంపిక చేసిన ఇస్రో యువిక సెలెక్షన్స్ లిస్ట్ లో 15 మంది లో తెలంగాణ వారి ఉండగా అందు లో కుమ్మరిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని శ్రీనిత్య ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. జాతీయ స్థాయి ఇస్రో యువిక ప్రోగ్రాంకు ఎంపిక కావడంతో మే 10 నుండి ఇస్రో టూర్ లో విద్యార్థి శ్రీనిత్య పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్బంగా పాఠశాల సిబ్బంది సోమవారం విద్యార్థి శ్రీనిత్య ను శాలువాతో సత్కరించి అభినందించారు.

## జగిత్యాల కేసీఆర్ బహిరంగ సభకు బీఆర్ఎస్ పార్టీ ఏర్పాట్లు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 13 :** భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కె. చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు, ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇన్‌చార్జ్‌లను ప్రకటించారు. ఈ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీ, ఈ, సభ విజయవంతం కోసం సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించింది. ముఖ్యంగా జగిత్యాల జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి ప్రత్యేక ఇన్‌చార్జ్‌లను కేటీఆర్ ఖరారు చేశారు. నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లుగా జగిత్యాలకు పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే, జనగామ, కోరుట్లకు ప్రశాంత్ రెడ్డి (ఎమ్మెల్యే, బాల్కొండ), ధర్మపురికి ఎల్. రవీందర్ రావు (ఎంఎల్సీ), వేములవాడకు బాల్క సుమన్ మాజీ ఎమ్మెల్యే, చొప్పదండికి పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలను నియమించారు. సభకు వచ్చే జన సమీకరణ, ప్రాంగణ ఏర్పాట్లు, నిర్వహణ బాధ్యతలను పార్టీ సీనియర్ నేతలు గాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించనున్నారు. వీరు క్షేత్రస్థాయిలో ఉండి సభ ముగిసే వరకు అన్ని ఏర్పాట్లను సమన్వయం చేస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి జగిత్యాల సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## సరస్వతీ పుత్రిక... నాగ విశిష్ట...

### -విశిష్ట చదువులో.. విశిష్టమే..

### -ఇంటర్ బైపీసీ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ

### -వెయ్యికి 995 మార్కులు సాధించిన హుజురాబాద్ విద్యార్థిని

**(కోరెం సుధాకర్ రెడ్డి, చురకలు ప్రతినిధి, హుజురాబాద్):** హుజురాబాద్ పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీరామ్ చక్రధర్ – మనోజ దంపతుల కుమార్తె శ్రీరామ్ నాగ విశిష్ట ఇంటర్ ఫలితాల్లో బై పి సి విభాగంలో రాష్ట్ర స్థాయిలో టాపర్ గా నిలిచింది. ఆదివారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో నాగ విశిష్ట 1000 మార్కులకు గానూ 995 మార్కులు సాధించింది. నాగ విశిష్ట పదోతరగతి వరకు స్థానిక టెట్రా హెడ్రన్ పాఠశాలలో, ఇంటర్మీడియట్ కాకతీయ జూనియర్ కళాశాలలో చదివింది. చిన్నప్పటి నుండి విశిష్ట చదువులో ముందుండేది ఉపాధ్యాయులు చెప్తున్నారు. బై పి సి విభాగంలో 995 మార్కులు రాష్ట్రంలో రెండవస్థానమని తెలుస్తోంది. శ్రీరామ్ చక్రధర్ మండలంలోని సిర్సపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. కాగా శ్రీరామ్ చక్రధర్ కుమారుడు శ్రీరామ్ విశాల్ గతంలో జె ఈ ఈ లో ఆల్ ఇండియా 190 ర్యాంకు సాధించి మద్రాస్ ఐ ఐ టి లో ఇంజనీరింగ్ పూర్తి చేసి.. ప్రస్తుతం అక్కడే ఎం టెక్ చేస్తున్నాడు. ఈ తానెప్పుడూ.. పిల్లల్ని చదువుకోవాలని చెప్పానే తప్ప ఏనాడూ ఒత్తిడి చేయలేదని, వారే ఇష్టంతో చదువుకుని అనుకున్నది సాధించారని విశిష్ట, విశాల్ తండ్రి శ్రీరామ్ తెలిపారు. నాగ విశిష్ట స్థానిక పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, అలాగే శ్రీరామ్ చక్రధర్ బంధు మిత్రులు, తోటి ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తూ.. ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

## సబ్ స్టేషన్ ఇట్లనే ఉంటుందా....?

### -ఇదంతా గడ్డి తొలగించరా...? అధికారులపై ఆగ్రహం

### -నెల రోజుల్లో మళ్ళీ వస్తా... సబ్ స్టేషన్ పరిశుభ్రంగా ఉండాలి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 13 :** ఎల్లారెడ్డిపేట 33/11 కెవి సబ్ స్టేషన్ ను తనిఖీ చేసిన టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి సబ్ స్టేషన్ అంటే ఇట్లనే ఉంటదా... మిగతా ఎన్పీడీసీఎల్ సబ్ స్టేషన్లు చూశారా... ఇదంతా గడ్డి ఏందంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.నేను మళ్లీ నెల రోజుల్లో వస్తా సబ్ స్టేషన్ ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. సబ్ స్టేషన్ లో పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించాలి.సబ్ స్టేషన్ లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎన్ని సబ్ స్టేషన్లు ఉన్నాయి అవి ఎలా పనిచేస్తున్నాయి ఓల్టేజ్ ఎలా ఉంటుంది అనే వివరాలను అడిగి తెలుసుకు న్నారు.రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి అని అధికారులను ఆదేశించారు.

## రోడ్డు భద్రత నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి

### జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ

**చురకలు విలేఖరి వీణవంక, ఏప్రిల్ 13:** ప్రజా పాలనలో భాగంగా సోమవారం వీణవంక మండల పరిధిలోని కోర్కల్ బస్టాండ్ వద్ద 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని వీణవంక పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు.జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొనిఈ సందర్భంగా సీఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ..వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, అది ప్రాణాపాయం నుండి రక్షిస్తుందని వివరించారు.ప్రజలు పోలీసులకు సహకరించి రోడ్డు భద్రతను పాటించాలని కోరారు. రోడ్ సేఫ్టీ ప్రత్యేక కమిటీ నియమించడం జరిగింది. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు తొందరగా పోలీసులకు సమాచారం అందించడానికి ఉపయోగపడుతుంది. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని హాస్పటల్లో చేర్పించి ప్రాణాలు రక్షించే వారికి 25 వేల నగదు పారితోషికం నించడం జరుగుతుంది. గ్రామంలో రోడ్డుపై గుంతలు పైనచోట మొరం పోయించారు. వారం రోజులపాటు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

# 25న తెలంగాణ జాగృతి కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భావం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 13 :** ఈనెల ఏప్రిల్ 25వ తేదీనాడు మేడ్చల్ జిల్లాలోని మునీరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్ లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవితక్క కొత్తగా ఏర్పాటు చేసే రాజకీయ పార్టీ ఆవిర్భావం సందర్భంగా తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి దండెం ఆనందన్న ముఖ్యఅతిథిగా హాజరై పోస్టర్ల ఆవిష్కరణ చేశారు,ఆదివారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో తెలంగాణ జాగృతి జిల్లా ఉపాధ్యక్షులు వర్ధ సతీష్ కుమార్ కదిరే భాస్కర్ గౌడ్ ల ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు,ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి దండెం ఆనందన్న మాట్లాడుతూ సామాజిక తెలంగాణ ధ్యేయంగా మహిళలు విద్యార్థులు యువకులకు పెద్దపీట వేస్తూ నీళ్లు నిధులు నియామకాలు గత ప్రభుత్వంలో మనకు సంపూర్ణంగా అందలేదు కాబట్టి పశ్నించు ,పోరాడు పరిష్కరించు అనే నినాదంతో పోరాటం చేసే దిశగా కవితక్క గారు కొత్త పార్టీ ఏర్పాటు చేస్తున్న సందర్భంగా పార్టీ పెట్టకముందే పెద్ద ఎత్తున టిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ ,పార్టీ నుండి పెద్ద ఎత్తున తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క ఆధ్వర్యంలో కండువా కప్పుకుని జాగృతిలో చేరడం జరుగుతుంది కాబట్టి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాల నుంచి గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు యువకులు రైతులు విద్యార్థులు ఈ యొక్క కొత్త పార్టీ ఆవిర్భావ సభకు తరలిరావాలని పిలుపునివ్వడం జరిగింది అదేవిధంగా జిల్లా ఉపాధ్యక్షులు వర్ధ సతీష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ జాగృతి సంస్థ స్థాపించినప్పటి నుండి గత 20 సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమంలో కవితక్క జాగృతి సంస్థ ద్వారా అనేక ఉద్యమాలు పోరాటాలు సేవా కార్యక్రమాలు చేసి తెలంగాణ మలిదశ ఉద్యమంలో తనదైన ముద్ర వేసుకొని రాష్ట్ర ఆవిర్భావంలో తన పాత్ర చాలా గొప్పది ఇది తెలంగాణ ప్రజానీకానికి తెలుసు కానీ గత పాలకులు తెలంగాణను నిర్లక్ష్యం చేసి నీళ్లు నిధులు నియామకాలు సక్రమంగా అమలు చేయక కవితక్క మరో ఉద్యమాన్ని చేపట్టే దిశగా ఈరోజు సామాజిక తెలంగాణ ఏర్పాటు దిశగా రాష్ట్రంలో ఇంటి పార్టీని ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేసిన క్రమంలో తెలంగాణ లోని సబ్బండ వర్గాల ప్రజల ఆశీర్వాదం ఉండాలని ఏప్రిల్ 25 నాడు కొత్తగా ఏర్పాటు చేసేటటువంటి రాజకీయ పార్టీ ఆవిర్భావ కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చి ఈ యొక్క కొత్త పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని జిల్లా ప్రజలను ఈ యొక్క కార్యక్రమానికి రావాలని ఆహ్వానించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నూనె మల్లేష్ యాదవ్, ,కూర సురేష్ బొమ్మ వరం రంగారావు,, ఎర్ర నరసయ్య, బాయికాడి ఆంజనేయులు, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, ,ఓరుసు అశోక్, ఎడ్ల రమేష్, అంకని ప్రభుదాస్, , తోట కనకయ్య, సలేంద్ర నవీన్, సంపునూరి సాయి ప్రశాంత్, శివరాత్రి ఎల్లయ్య, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఎల్లారెడ్డిపేట సబ్‌స్టేషన్లను తనిఖీ చేసిన టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

### -రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

### - విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

### -వ్యవసాయ కనెక్షన్ల మంజూరు వేగవంతం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 13 :** తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎన్పీడీసీఎల్) చైర్మన్ ఌ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని 132/33 కెవి , 33/11 కెవి సబ్‌స్టేషన్లను సోమవారం స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముందుగా ట్రాన్స్కో అధికారులతో మాట్లాడుతూ పవర్ ఫ్యాక్టర్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు . పవర్ ఫ్యాక్టర్ .9 వస్తుందని చెప్పగా , ఇంకా పవర్ ఫ్యాక్టర్ మెరుగుపరచుకోవాలని సూచించారు . ఓవర్ లోడ్ ఉన్న ఫీడర్ ఉన్న వాటిని బదలాయింపు చర్యలు చేపట్టాలని , అలాగే కెపాసిటర్ బ్యాంకు లు పెట్టాలని అన్నారు . రైతులకు విద్యుత్ అంతరాయాలు కలగకుండా నిరంతరాయంగా సరఫరా అందించాలని ఆదేశించారు . అంతేకాక సబ్‌స్టేషన్ల యార్డ్ పరిసరాలను అన్నివేళలా శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు . విద్యుత్ మౌలిక సదుపాయాల పై సీఎండీ చర్చిస్తూ , వినియోగదారులకు , రైతులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలన్న సంకల్పంతో ముందుకు వెళ్లాలని చెప్పారు . ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సెస్ బాధ్యతలు స్వీకరించే సమయానికి (ఏప్రిల్ 1) పెండింగ్‌లో ఉన్న 2491 వ్యవసాయ విద్యుత్ దరఖాస్తులను గుర్తించి , వీటిని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని , ఇప్పటి వరకు 431 కనెక్షన్లు ఇచ్చామని, మిగిలిన వాటిని నెలవారీ ప్రాతిపదికన పూర్తి చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు లక్ష్యాలను నిర్దేశించామన్నారు. కొత్త కనెక్షన్ల కోసం వినియోగదారులు మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు . సిరిసిల్ల పట్టణంలోని పవర్ లూమ్ యూనిట్లపై బిల్లింగ్ భారాన్ని తగ్గించేందుకు, వాటి టారిఫ్ కేటగిరీని 'కేటగిరీ- నుండి 'కేటగిరీ-×ఎ'కి మారుస్తూ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు . నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ఎన్పీడీసీఎల్ ఇప్పటికే దాదాపు ?2.0 నుండి ?2.5 కోట్ల వ్యయంతో సుమారు 80 సంఖ్యలో 33/11 ఎంఎ సబ్‌స్టేషన్లను నిర్మించామని వెల్లడించారు . అనవసరమైన ట్రిప్పింగ్‌లను తగ్గించేందుకు ప్రతి సబ్‌స్టేషన్‌లో అత్యాధునిక ట్రాన్స్‌ఫార్మర్లు , బ్రేకర్లను ఏర్పాటు చేశామని తెలిపారు . . భవిష్యత్తు అవసరాల కోసం ?45 కోట్ల అంచనా వ్యయంతో మరో 15 కొత్త సబ్‌స్టేషన్లను మంజూరు చేశామని చెప్పారు . . వీటిలో కొన్నింటికి ఇప్పటికే ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమి పూజ పూర్తయిందని , ఈ పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని అన్నారు .గతంలో సెస్ హయాంలో ఒకే బ్రేకర్ ద్వారా 2-3 ఫీడర్లను అనుసంధానించడం వల్ల తరచుగా అంతరాయాలు కలిగేవి. దీనిని పరిష్కరించేందుకు ?1.5 కోట్ల వ్యయంతో అదనంగా 20 బ్రేకర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని , ఈ పనులు 15-20 రోజుల్లో పూర్తవుతాయని వివరించారు . విద్యుత్ నిరంతరాయంగా అందేలా సుమారు ?30 కోట్ల వ్యయంతో 33 ఎంఎ ఇంటర్ లింకింగ్ లైన్లను వేశామని చెప్పారు . . దీనివల్ల ఒక ఫీడర్‌లో సమస్య వచ్చినా, మరో మార్గం ద్వారా విద్యుత్ సరఫరా చేసే వీలుంటుంది అన్నారు . ఇతర 17 జిల్లాల మాదిరిగానే సిరిసిల్లలో కూడా ఖూాజ విధానాన్ని అమలు చేస్తున్నామని , . దీనివల్ల సర్వీస్ కనెక్షన్ ఛార్జీలు సరళతరం చేయబడ్డాయి . గతంలో వినియోగదారులు చెల్లించే ?20,000 నుండి ?60,000 వరకు ఉన్న ాా=జ ఛార్జీలను రద్దు చేశామని చెప్పారు . వినియోగదారులు చెల్లించాల్సిన రుసుము: వ్యవసాయ కనెక్షన్ల కోసం కేవలం కిలోవాట్‌కు 1,000 మాత్రమే అన్నారు . నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే "గృహ జ్యోతి" పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని , అర్హులైన వారు సంబంధిత పత్రాలతో స్థానిక ఏఈ (ూాజు) కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. 'పొలం బాట/ప్రజా బాట' కార్యక్రమంలో భాగంగా వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయడం, మధ్యలో స్తంభాలను ఏర్పాటు చేయడం వంటి పనులను వేగవంతం చేశామని , అత్యవసర పరిస్థితుల కోసం 1000కి పైగా విద్యుత్ స్తంభాలను సిరిసిల్లలో సిద్ధంగా ఉంచామని , కరీంనగర్ స్టోర్స్ నుండి ?5 కోట్ల విలువైన మెటీరియల్ ఇప్పటికే సిరిసిల్లకు తరలించామన్నారు . అంచనాలు మరియు పనుల అమలులో పారదర్శకత కోసం 'ూాూా' ఆధారిత సాఫ్ట్ వేర్ విధానాన్ని ప్రవేశపెట్టి, ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చామని , ఉన్నతాధికారులు నిరంతరం సిరిసిల్లలో పర్యటిస్తూ పనులను పర్యవేక్షిస్తారన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్‌ను అందించేందుకు ఎన్పీడీసీఎల్ కట్టుబడి ఉందని , ఈ క్రమంలో వినియోగదారులు నెలవారీ విద్యుత్ బిల్లులను క్రమం తప్పకుండా చెల్లించాలని , గృహ జ్యోతి వంటి ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు .


# వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం





**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఎప్రిల్ (13):** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని యామపుర్ గ్రామంలో ప్రతి సవత్సరం వార్షికంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగ రంగ వైభవంగా జరుగుతాయి.సోమవారం గ్రామస్తులు దాతల సహకారం తో దేవలయకమిటీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం ఎర్పాట్లు చేయగా అర్చకులు చక్రపాణి మాదవచార్యులు ,సామాజి నవిన్ చార్యులు,మంత్రరాజం శ్రీనివాస్ చార్యులు కరకములచే స్వామి వారి కళ్యాణం జరిగింది. ముడు రోజులు గా స్వామి వారి అలయం లో లోక కళ్యాణం కోసం జరుగుతున్న యజ్ఞం పుర్ణహృతి చేశారు. అనతరం అలయం లో అలయ బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేక పల్లకి లో బజాబజంత్రిలతో ఎదుర్కొంటు వేద మంత్రో చరణ మధ్య స్వామి వారిని కల్యాణ మండపం లో కోలువుదిర్చి శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి అలివేలు మంగమ్మల కు కళ్యాణం నిర్వహించారు.కళ్యాణం అనతరం మహిళలు ఓడిబియ్యం సమర్పించారు.భక్తులు ప్రత్యేక మెక్కులు చెల్లించుకున్నారు. దేవలయ కమిటీ అధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. అలయం లో కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విధ్యసాగర్ రావు,కాంగ్రెస్ పార్టీ నియెజికవర్గ నాయకులు జువ్వాడి కృష్ణారావు,కల్వకుంట్ల రామరావు లు ప్రత్యేక పుజలు నిర్వహించి కళ్యాణం లో పాల్గొన్నారు. అలయం వేంకటేశ్వర స్వామి వారిని భక్తులు ప్రత్యేక పుజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనుక నాగేష్ ,అభివృద్ధి కమిటీ సభ్యులు మోర్తాటి చిన్న గంగారెడ్డి ,మోర్తాటి గంగారెడ్డి, కాస రాజేందర్ ,చెదలు తిరుపతి ,చింతకుంట సుధాకర్ ,తెడ్డు భూమేష్ ,చేని భానుచందర్, మిరుదొడ్డి స్వామి ,బోరిగాం శ్రీకాంత్ ,బిచ్చల శ్రీకాంత్,గుండాల నర్సయ్య, తోపారపు రవి,అల్లెపు శుభయ్య ,వేములవాడ గంగాధర్ ,పల్లెమిది మలేష్ ,ఎల్లాల స్వామి ,సుంకే మురళి, తుపాకుల శ్రీనివాస్ ,గోపు రాజు,బిచ్చల వెంకటేష్,గన్నారపు నర్సయ్య అయాగ్రామల నాయకులు మహిళలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.





### డంపింగ్ యార్డ్ పై

# గ్రామ సభలు పెట్టండి



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 13:** హుజురాబాద్ పట్టణంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరాహార దీక్ష సోమవారం 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షలో హుజురాబాద్ క్లబ్ సభ్యులు పాల్గొనగా, వారికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజలు 22 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ కోసం సుమారు 500 ఎకరాల భూమి సేకరించినట్లు సమాచారం ఉందని, వెంటనే ఈ ప్రాంతం నుంచి డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సుడా చైర్మన్ హుజురాబాద్ ప్రజలు డంపింగ్ యార్డ్ కావాలని కోరుకుంటున్నారని చెబుతున్నారని, నిజంగా ప్రజలు కోరుకుంటున్నారో లేదో తెలుసుకోవాలంటే గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలని అన్నారు. గ్రామ సభలో ప్రజలే వాస్తవ పరిస్థితిని వెల్లడిస్తారని, ప్రజలే మీకు బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోకపోతే ఐకాస ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్ వల్ల 9 మండలాల ప్రజల ఆరోగ్యం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం ఉంటుందని పేర్కొంటూ, ఆ మండలాల ప్రజలందరినీ ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. అఖిలపక్షం ఏర్పాటు అనంతరం లక్ష మందితో భారీ ధర్నా నిర్వహిస్తామని, ఈ ప్రాంతం నుంచి డంపింగ్ యార్డ్ తొలగించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ ప్రతిపాదనకు అంగీకరించి సంతకం చేసినట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధం అని సవాల్ విసిరారు. లేనిపక్షంలో తమ పై ఆరోపణలు చేస్తున్న వారు తమ పదవులకు రాజీనామా చేసి హుజురాబాద్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు. ఈనెల 19న డంపింగ్ యార్డ్ ప్రాంతంలో నిర్వహించనున్న మల్లన్న పట్నాలు కార్యక్రమానికి ప్రజలు భారీ ఎత్తున పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, హుజురాబాద్ క్లబ్ సభ్యులు కళ్లెపు మోహన్ రావు, ఐ రెడ్డి భాస్కర్ రెడ్డి, నాగార్జున డైరీ చైర్మన్ పుల్లూరి ప్రభాకర్ రావు, మహాకళ వీరసేనారెడ్డి, ఎర్రం నారాయణరెడ్డి, శివ, మల్లారెడ్డి, న్యాయవాదులు లక్ష్మణమూర్తి, గోస్కుల శ్రీనివాస్, పాల్గొన్నారు.

## పంట చేనుకు నీడ వస్తుందని ఏకంగా 36 చెట్లను యేథేచ్ఛగా నరికి వేత

### -చోద్యం చూస్తున్న పాలకవర్గం పంచాయతీ కార్యదర్శి జి పిఓ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 13 :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి రోడ్లకు ఇరువైపులా నీడను ఇచ్చే చెట్లను పకృతి వనాల పెంపకాన్ని చేపట్టిన విషయం మనందరికీ తెలిసిందే, ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామం నుండి కొనరావుపేట వైపు వెళ్లే రహదారిలో స్మశాన వాటిక సమీపంలో గత ఆరు సంవత్సరాలుగా రోడ్డుకు ఇరువైపులా పెంచుతున్న నీడనిచ్చే చెట్లను అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తమ వరి పంట కు నీడ వస్తుందని దీంతో పంట దిగుబడి తగ్గుతుందనే ఉద్దేశంతో యదేచ్ఛగా ఏకంగా 36 చెట్లను గొడ్డల్లతో ఆదివారం నరికి వేశారు. గ్రామ సర్పంచ్ పాలకవర్గానికి పంచాయతీ కార్యదర్శి కి జిపిఓ కు ఈ విషయం తెలిసినప్పటికీ పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని గ్రామంలో విమర్శలు తలెత్తినాయి, ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని చురకలు తెలుగు దినపత్రిక ప్రతినిధి వివరణ కోరగా తాను డ్యూటీలో లేనని సెలవు పై వెళ్ళానని వచ్చిన తరువాత వారు ఎంతటి వారు అయినా విచారణ చేపట్టి చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ఆమే తెలిపారు, చెట్లను నరికి వేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు

## ఇంటర్ ఫలితాల్లో

# ఎల్లారెడ్డిపేట విద్యార్థుల ప్రభంజనం









**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 13 :** ఆదివారం వెలువడిన ఇంటర్ ఫైనల్ ఫలితాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతులు నేవూరి బామ్మ గారి రాజిరెడ్డి లతల కూతురు లక్షణ కరీంనగర్ లోని అల్ఫోర్స్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివి 985 /1000 అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలువగా ఎల్లారెడ్డిపేట మండల తెలుగు ప్రభ దినపత్రిక రిపోర్టర్ మాజీ ఎంపిటిసి ఒగ్గు బాలరాజు యాదవ్ ఉపసర్పంచ్ రజిత ల కూతురు ఒగ్గు శ్రీనిధి యాదవ్ కరీంనగర్ లోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి విభాగంలో 984/1000 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచింది , ఎల్లారెడ్డిపేట మండల దిశ తెలుగు దినపత్రిక విలేఖరి పెంటం శ్రీనివాస్ రజిత కుమారుడు పెంటం నిహార్ హైదరాబాదులోని కేశవ స్మారక మెమోరియల్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకొని 927/1000 మార్కులు సాదించాడు. అదేవిధంగా హెచ్ 5 ఛానల్ న్యూస్ రిపోర్టర్ యమగోండ పద్మా రెడ్డి చంధన కూతురు యమగోండ సంజన ఎస్సార్ కళాశాల మల్లంపేట ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 898/1000 మార్కులు సాధించింది. ఇంటర్ ఫైనల్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పిల్లలను వారి తల్లిదండ్రులను ఏఎంసి చైర్మన్ షేక్ సభేరా బేగం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి బిజెపి పార్టీ మండల అధ్యక్షులు రేపాక రామచంద్రారెడ్డి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య , బిఆర్ఎస్ పార్టీ మండల అద్యక్షులు వరస కృష్ణ హారి , ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి సర్పంచ్ ఎలగందుల నరసింహులు ఉప సర్పంచ్ బందారపు బాల్రెడ్డి సింగిల్ విండో మాజీ అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ బండారి బాల్ రెడ్డి, లు అభినందించారు,